క్లుప్తంగా

జిల్లా జట్టుకు విద్యార్థుల ఎంపిక



పెబ్బేరు రూరల్: పెబ్బేరు మండలంలోని సూగూరు, శ్రీరంగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శ్రీవాణి, పవిత్ర వనపర్తి జిల్లా మహిళా సీనియర్ కబడ్డీ జట్టుకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 4 నుంచి 6 వరకు నిజామాబాద్ జిల్లాలోని బసాపూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి మహిళా సీనియర్ కబడ్డీ పోటీల్లో వనపర్తి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఎంపికైన విద్యార్థులను ఆయా పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చిన్నయ్య, నాగేంద్రంగౌడ్, పీఈటీ కురుమయ్య, ఎస్ నిరంజన్‌గౌడ్ పాల్గొన్నారు.

నిరంజన్‌రెడ్డి గెలిస్తేనే అభివృద్ధి సాధ్యం



ఖిల్లాఘనపురం: వ్యవసాయ శాఖమ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందాలని కోరుతూ శనివారం ఖిల్లాఘనపురం జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, గోపాల్‌పేట జెడ్పీటీసీ సభ్యురాలు భార్గవి మండలంలోని గట్టుకాడిపల్లిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామికి పూజలు చేసి మంత్రి ఎమ్మెల్యేగా గెలవాలని, వనపర్తి జిల్లా ప్రజలకు సేవలందించి అభివృద్ధి చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత రైతులు బాగుకోసం నిరంతరం కృషిచేసిన మంత్రి నిరంజన్‌రెడ్డి మరోసారి గెలుస్తారని జోస్యం చెప్పారు. ఆయనకు వేడుకొండల వాడి దయ ఉండాలని పూజలు నిర్వహించినట్లు తెలిపారు.

మహిళా చట్టాలపై అవగాహన



మానవపాడు: మండల కేంద్రంలోని శ్రీ గంగు వెంకటకృష్ణారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం 'బేటీ బచావో బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా సాధికారత కేంద్ర కో ఆర్డినేటర్ జ్యోత్స్న మాట్లాడారు. ఆహారం, పోషకాహారం న్యూట్రీషన్, రక్తహీనత, వ్యక్తిగత పరిశుభ్రత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలికలు ఉన్నత చదువులు చదవాలని కోరారు. బాలలకు హక్కులకు ఆటంకాలు వాటిల్లితే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు.

టీఆర్‌టీఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలోని పదో పటాలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం టీఆర్‌టీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు కావలి అశోక్‌కుమార్ హాజరై జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షునిగా రవి కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీఆర్‌టీఎఫ్ నాయకులు, తదితరులు ఉన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో భక్తుల ప్రత్యేక పూజలు

మల్దకల్: స్థానిక స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మధుసూదనాచారి, రమేషాచారి, రవిచారి స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కొంత మంది భక్తులు స్వామి వారికి దాసంగా నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదిశిలా క్షేత్రం, కృష్ణస్వామి ఆలయాలలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, నాగరాజుశర్మ, బాబురావు, ఆలయ సిబ్బంది ఉరుకుందు, శ్రీను, రంగస్వామి, కృష్ణ, శివమ్మ తదితరులు ఉన్నారు.

ప్రమాద సూచికలేవీ?



బుద్దారం గండి జిల్లా సరిహద్దు వద్ద సూచికబోర్డులు లేకుండా ప్రమాదకరంగా మలుపు (ఫైల్)

- అతివేగానికి గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- కొత్త రోడ్లపై వేగం నివారించేలా చర్యలు కరువు
- అధికారుల నిర్లక్ష్యంపై వాహనదారుల ఆందోళన



ఏదుట్ల సమీపంలో సూచికబోర్డు లేకుండా ప్రమాదకరంగా ఉన్న రోడ్డుమలుపు

గోపాల్‌పేట: ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో డబుల్ బీటీ రోడ్లు వేయడం పూర్తి కావడంతో వాహనాలు వేగం పెరిగింది. దీంతో ప్రమాదాలు తీవ్రత సైతం పెరిగాయి. కొన్నేళ్లుగా రోడ్లు సరిగా లేక వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ప్రస్తుతం మండలంలో ఆర్‌అండ్‌బీ రోడ్లు, పీఆర్ శాఖల ఆధ్వర్యంలో కొత్తగా బీటీ రోడ్లు వేశారు. కానీ బీటీ రోడ్డు మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, కూడళ్ల వద్ద స్పీడు బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాల్లో కొందరు మృత్యువాత పడుతుండగా చాలామంది తీవ్రంగా గాయాపడుతున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోకుంటే మరిన్ని ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని వాహనదారులు కోరుతున్నారు.

మండలంలో పరిస్థితి

ఉమ్మడి మండలంలో గతేడాది ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఆర్‌అండ్‌బీ, పీఆర్ పరిధిలో కొత్త రోడ్డు ఏర్పాటు చేయడంతో పాటు కొన్ని రోడ్డు రెన్యూవల్ చేశారు. రేవల్లి నుంచి గోపాల్‌పేట వరకు 19 కిలోమీటర్ల రోడ్డు పూర్తయింది. గోపాల్‌పేట నుంచి చెన్నూరు వరకు ఉన్న బీటీ రోడ్డు రెన్యూవల్ చేశారు. చాకల్‌పల్లి సమీపంలో నుంచి కేశంపేట పాతతండా వరకు బీటీ రోడ్డు వేశారు. ఇలా మండలంలో చాలా వరకు కొత్తరోడ్ల నిర్మాణం చేశారు. ఆ తర్వాత స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు వేగంగా వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. నవంబర్ 27 రాత్రి వనపర్తి నుంచి బుద్దారం వైపు ద్విచక్రవాహనంపై ఇద్దరు వ్యక్తులు వెళ్తుండగా ఓ కంటెయినర్ వాహనం ఢీకొట్టడంతో శ్రీహరి అనే యువకుడు తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. అదే ప్రమాదంలో మరో యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. బుద్దారం గ్రామానికే చెందిన ఏఆర్ కానిస్టేబుల్ శివకుమార్ డిసెంబర్ 28 రాత్రి సమయంలో బుద్దారం నుంచి వనపర్తి వెళ్తుండగా బుద్దారం శివారులో మలుపు వద్ద బైకు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న కరెంటు పోల్‌కు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఏదుట్ల, గోపాల్‌పేట మధ్యలో ఇద్దరు, చీర్కపల్లి సమీపంలో ఇద్దరు వ్యక్తులు బైకుపై అతివేగంతో వెళుతూ కిందపడి మరణించారు. ఇలా గతేడాది నుంచి సుమారు ఎనిమిది మంది వరకు మరణించారు. ఇరవైమందికి పైగా గాయాలపాలయ్యారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



గోపాల్‌పేట నుంచి ఏదుల, రేవల్లి వరకు బీటీ రోడ్డు పూర్తయింది. ఏదుట్ల రోడ్డులో మలుపులు ఎక్కువగా ఉండటం, రోడ్డు విశాలంగా ఉండటంతో వాహనాలు ఎక్కువ స్పీడుతో వెళుతున్నాయి. ఈ రోడ్డులో ప్రమాదాలు చోటు చేసుకుని ముగ్గురు చనిపోవడంతో పాటు చాలా మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రమాదాలు నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సంగనమోని వెంకటస్వామి, గోపాల్‌పేట

చర్యలు తీసుకుంటాం

వనపర్తి డిగ్రీ కాలేజీ నుంచి బుద్దారం గండి సమీపంలో ఉన్న జిల్లా సరిహద్దు వరకు సూచిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు ఇతర పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి రూ.30 లక్షలు మంజూరయ్యాయి. టెండర్లు పిలవాల్సి ఉంది. ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చినందున టెండర్లు ఆగాయి. ఎన్నికల కోడ్ తీసివేసిన తర్వాత టెండర్లు పిలిచి పనులు పూర్తి చేస్తాం.

– దేస్యానాయక్, ఆర్‌అండ్‌బీ ఈఈ, వనపర్తి జిల్లా

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



కేంద్రాల వారీగా వివరాలు పరిశీలిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాహిన్‌బేగం

పాన్‌గల్: అంగన్‌వాడీ కేంద్రాల పూర్తి వివరాలను ప్రతి నెల 5వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాహీన్‌బేగం అన్నారు. శనివారం మండల కేంద్రంలో పాన్‌గల్ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా కేంద్రాల పరిధిలోని టీచర్లు కేంద్రాల వారీగా చిన్నారుల వివరాలు, పంపిణీ చేస్తున్న గుడ్లు, పౌష్టికాహారం, చిన్నారి బరువు, ఎత్తు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వివరాల నమోదులో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో పాటు పౌష్టికాహారాన్ని పకడ్బందీగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలన్నారు.

చెరువు పరిసరాల్లో పందుల సంచారం

పాన్‌గల్: మండల కేంద్రంలోని పాల్కి చెరువు పరిసరాల్లో పందుల సంచారాన్ని నిరోధించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రతి నిత్యం పందులను చెరువు పరిసరాలల్లోని అలుగు కట్టపై ఉంచి తిండి వ్యర్థ పదార్థాలను పందులకు అందిస్తుండడంతో చెరువు పరిసరాలు దుర్వాసనతో పాటు చెరువు నీరు కూడా కలుషితం అవుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, గ్రామపంచాయతీ వారు స్పందించి చెరువు పరిసరాల్లో పందుల సంచారాన్ని నిరోధిస్తూ పరిసరాలు అపరిశుభ్రం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



శ్రీహరి గెలుపునకు ఆలయంలో పూజలు



పూజల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

అమరచింత: మక్తల్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి అఖండ మెజారిటీతో గెలవాలని శనివారం అడవి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని సింగంపేటలో వెలిసిన అడవి ఆంజనేయ స్వామి ఎంతో మహిమానితుడని, మొక్కులు తీర్చే దేవుడని గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు కొమరి రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. పట్టణంలోని రాజావళి, మహబూబ్‌ఉస్సేనీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈమేరకు వారు మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న రాష్ట్రం బీఆర్‌ఎస్ పార్టీ కబంధ హస్తాల మధ్య అప్పుల తెలంగాణగా మారిందన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన మక్తల్ నియోజకవర్గ అభ్యర్థి వాకిటి శ్రీహరి భారీ మెజారిటీతో గెలిస్తే ఆలయంలో 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వడ్డె శ్రీను, చిన్న ఆంజనేయులు, చిన్నకురుమన్న, పెద్దకురుమన్న, వెంకటేష్, అన్నమయ, బంగ్లారాములు తదితరులు పాల్గొన్నారు.

కోటి లింగాల ప్రతిష్ఠ మహోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల దత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో నూతనం ఏర్పాటు చేయనున్న కోటిలింగాల ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం ఆరు రోజులుగా కొనసాగుతుంది. మొదటి రోజు రుద్రహోమంతో ప్రారంభమై లింగాల ప్రతిష్ఠ ఆరో రోజు వివిధ రకాల పూజా కార్యక్రమాల ద్వారా లింగాల ప్రతిష్ఠ మహోత్సవం కొనసాగింది. పూజల్లో కొత్తకోట పట్టణ కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని లింగాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని తిలకించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్తీక మాసం మొత్తం 15రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగుతాయని పూజారులు తెలిపారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన

పాన్‌గల్: మండలంలోని బండపల్లిలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వ్యాధి నిరోధక టీకాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాస్ మాట్లాడారు. చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు తప్పక వేయించి రోగాల నుంచి కాపాడాలని సూచించారు. తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులు, తల్లిపాల ప్రాముఖ్యత తదితర అంశాలపై గ్రామస్తులకు వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో రోగాలకు దూరంగా ఉండొచ్చన్నారు. పీహెచ్‌సీ ద్వారా అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు రమాదేవి, శైలజ, ఆశా కార్యకర్త విజయ, మహిళలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఆఫీసర్ రామయ్య

ప్రహరీ లేక విద్యార్థుల ఇక్కట్లు

అమరచింత: మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహానికి పూర్తిగా ప్రహరీని నిర్మించకపోవడంతో వసతి గృహంలో చదువుకుంటున్న విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వసతి గృహానికి పూర్తి స్థాయిలో ప్రహరీ నిర్మించాల్సి ఉండగా నిధుల లేమితో ఎల్ ఆకారంలో మాత్రమే నిర్మించి వదిలేశారు. దీంతో వసతి గృహ ఆవరణంలో పశువులు, మేకలు, గొర్రెలు చొరబడి నాటిన మొక్కలను నాశనం చేస్తున్నాయి. చుట్టుపక్కల పంట పొలాలు ఉండటంతో రాత్రి వేల విషపురుగులు సైతం వసతి గృహ వరండాలో సంచరిస్తున్నాయని విద్యార్థులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో వసతి గృహానికి కంపౌండ్ వాల్ నిర్మించి విద్యార్థులను ఆదుకోవాలని కోరుతున్నారు.



కంపౌండ్ వాల్‌కు నోచుకోని వసతి గృహం

గట్టుపై పట్టెవరికీ?

- ఆయా గ్రామస్తుల మెజార్టీ తీర్పు ఎటు వైపు
- అంచనాల్లో పార్టీల నేతలు

గట్టు: అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగియగా మండలంలోని మెజార్టీ గ్రామాల ప్రజలు ఎటు వైపు మొగ్గు చూపారనే దానిపై గ్రామాల్లో జోరుగా చర్చలు కొనసాగుతున్నాయి. గట్టుపై ఎవరు పట్టు సాధిస్తారనేది ఆసక్తికరంగా మారింది. గతంలో పట్టు సాధించిన నాయకులు అదే పట్టును కొనసాగిస్తారా లేక పట్టును కోల్పోతారా? అనేది తేలాల్సి ఉంది. బీఆర్‌ఎస్‌తో పాటుగా కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు గట్టుపై పట్టును సాధించేందుకు శతవిధాల ప్రయత్నాలు చేశారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో 55 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 46,773 మంది ఓటర్లకు గాను 39,523 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 84.50 శాతం ఓటింగ్ నమోదైంది. గతంతో పోల్చుకుంటే ఈ సారి మండలంలో ఓటింగ్ శాతం పెరిగినట్లు విశ్లేషకులు బావిస్తున్నారు. మండలంలో మెజార్టీ గ్రామాలైన గట్టు, మాచర్ల, బోయలగూడెం, ఇందువాసి, చాగదోణ, మిట్టదొడ్డి, తుమ్మలపల్లి, గొర్లఖాన్‌దొడ్డి, ఆరగిద్ద, పెంచికలపాడు, ఆలూరు, తుమ్మలచెరువు గ్రామాల ప్రజలు ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతారనే ఆసక్తికర చర్చలు గ్రామాల్లోని టీ కొట్టు దుకాణాల్లో, రచ్చకట్టల దగ్గర కొనసాగుతున్నాయి. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బల్గెర గ్రామానికి చెందిన బోయ శివారెడ్డి పోటీలో ఉన్నారు. బోయ శివారెడ్డి తన సామాజిక వర్గంతో పాటుగా ఇతర సామాజిక వర్గాలకు చెందిన ఎంత మంది ఓటర్లపై ప్రభావం చూపుతారనే దానిపై ఆసక్తి నెలకొంది. ఏఐఎఫ్‌బీ పీకి చెందిన రంజిత్‌కుమార్ పక్క మండలం చింతలకుంట. రంజిత్‌కుమార్ కూడా ఎంత వరకు ఓటర్లను తన వైపు తిప్పుకుంటారనేది ఆసక్తిగా మారింది. ఇక ప్రధాన పార్టీలకు చెందిన బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, సరితలకు చెందిన అనుచరులు ప్రతి గ్రామంలో ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు చివరి దాకా విశ్వప్రయత్నాలు చేశారు. ఓటర్లకు ఎవరి వైపు మొగ్గు చూపారనేది తేలాల్సి ఉంది.

శిథిలావస్థలో అదనపు గది



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలకు అదనపు గది నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా.. కాంట్రాక్టర్ అలసత్వంతో అసంపూర్తిగా నిర్మించి వదిలేయడంతో నిర్మాణ దశలోనే శిథిలావస్థకు చేరుకుంది. 2012లో అదనపు గది నిర్మాణం కోసం రూ.2 లక్షలు నిధులు మంజూరు చేయగా.. కాంట్రాక్టర్ గది నిర్మాణాన్ని పూర్తి చేయకుండా గోడల వరకు నిర్మించి వదిలేశాడు. ప్రస్తుతం గది శిథిలావస్థకు చేరుకుంది. మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలలో గదులు చాలక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి అదనపు గది నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం



కొత్తకోట రూరల్: పెద్దమందడి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ గత నెల 22న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ బాలరాజు(35)కుటుంబానికి జిల్లా పోలీస్ సంఘం ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు సీఐలు, ఎస్‌ఐ లు, పెద్దమందడి పోలీస్ స్టేషన్ సిబ్బంది కలిసి రూ.1.50లక్షలు జమచేశారు. శనివారం వనపర్తి మండలం శ్రీనివాసపూర్‌లో మృతుడు బాల రాజు దశదినకర్మ సందర్భంగా కొత్తకోట సీఐ శ్రీనివాస్‌రెడ్డి, పెద్దమందడి ఎస్‌ఐ హరిప్రసాద్ బాలరాజు చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. మృతుడి భార్యకు కొత్తకోట సీఐ శ్రీనివాస్‌రెడ్డి నగదును అందజేశారు.

కరువు మండలంగా ప్రకటించాలి

ఉండవెల్లి: రైతులకు పంటల పరంగా దిగుబడులు లేక, వర్షాలు రాకా ఇబ్బందులు పడుతున్నారని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించేందుకు ఉన్నతాధికారులకు తెలపాలని వైస్ ఎంపీపీ దేవన్న అధికారులతో తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ఎంపీపీ బీసమ్మ, ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సభకు కోరం ఉన్నా అడగటానికి సర్పంచు ఒక్కరే ఉండడంతో సమస్యలపై ప్రశ్నలు రాలేదు. అధికారులు పాల్గొనాల్సిన తరుణంలో ముగ్గురే రావడంతో, అధికంగా సిబ్బంది ఉన్నారు. ఏఓ సురేఖ మాట్లాడుతుండగా మండలాన్ని కరువు మండలంగా గుర్తించి రైతులకు నష్టపరిహారం అందించాలని వైస్ ఎంపీపీ దేవన్న కోరారు. దీంతో ఉన్నతాధికారులకు తెలపుతామని పేర్కొన్నారు. సర్పంచు లోకేశ్వర్ రెడ్డి ఏపీఓను గ్రామ పంచాయతీ బిల్లులపై ఆరా తీయగా, ఏపీఓ సానుకూలంగా స్పందించారు.

దోమల నిర్మూలనకు కృషి చేయాలి

కొత్తకోట రూరల్: దోమ కాటు వలన వచ్చే వ్యాధుల గురించి మలేరియా నివారణ అసిస్టెంట్ అధికారి శ్రీనివాస్‌జీ ఆధ్వర్యంలో శనివారం పట్టణ కేంద్రంలోని ఎస్సీ కాలనీలో జిల్లా ఏఎల్‌ఓ టీం ద్వారా ఇంటింటికీ తిరుగుతూ దోమల నివారణ కోసం అవగాహన కల్పిస్తూ దోమలు ఉన్న చోట స్ప్రే చేశారు. ఈ సందర్భంగా జిల్లా అసిస్టెంట్ మలేరియా నివారణ ప్రోగ్రాం అసిస్టెంట్ అధికారి శ్రీనివాస్‌జీ మాట్లాడుతూ ఇంట్లో నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెంది వివిధ రకాల జ్వరాలు, మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులను కలుగజేస్తుంటాయన్నారు. దోమలను నివారించేందుకు ఇళ్ల పరిసరాల్లో వృథాగా పడి ఉన్న ప్లాస్టిక్ కంటైనర్లు, సిమెంట్ హౌజ్‌లు, కుండలు, టైర్లు మొదలగు వ్యర్థ పదార్థాలను తీసివేయాలని సూచించారు. నిరంతరం ప్రతి ఒక్కరూ ప్రతి శుక్రవారం 'డ్రై డే' దినాన్ని పాటించాలని కోరారు. ప్రజలందరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సూపర్‌వైజర్ బీటీ రాణి, హెల్త్ అసిస్టెంట్ గంధం రాజు, శ్రీనివాస్, మధుగౌడ్, ఏఎన్‌ఎం, బ్రీడింగ్ వర్కర్స్, ఆశావర్కర్స్ తదితరులు ఉన్నారు.



దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రమాదకర పాడుబావిని పూడ్చండి



అమరచింత, తండా మధ్య ప్రమాదకర పాడుబావి

అమరచింత: పట్టణ శివారులో మద్దూరుకు వెళ్లే రహదారిలో కొత్త తండా సమీపంలో ప్రమాదకర పాడుబావిని పూడ్చాలని తండా ప్రజలతో పాటు పట్టణవాసులు కోరుతున్నారు. రహదారికి ఇరువైపులా మలుపుల వద్ద పాడుబడ్డ పాడు బావులు ఉన్నాయని, దీంతో వాహనదారులు వేగంగా వాహనాలను నడుపుతూ మలుపుల వద్ద పాడుబావులను గమనించక అదుపు తప్పి గాయాల పాలవుతున్నారని తెలిపారు. రెండేళ్ల కిందట పాంరెడ్డిపల్లికి చెందిన యువకుడు తాగిన మైకంలో ద్విచక్ర వాహనంతో సహా పాడుబావిలో పడటంతో అక్కడే మృతి చెందినా.. వీటిని పూడ్చాలనే ఆలోచన అధికారులకు కలుగక పోవడం శోచనీయం అంటున్నారు. ఇప్పటికైనా పాడుబావులను పూడ్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కార్తీకమాస ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని ప్రసిద్ధి చెందిన ఆదిఆంజనేయస్వామి దేవాలయంలో కార్తీక మాస శనివారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూలతో అలంకరించి పంచామృతాభిషేకం, అర్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నట్లు ఆలయ అర్చకులు రాఘవేందర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు అందించినట్లు వివరించారు.



అయ్యప్ప ఆలయంలో..

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని సంకల్ప సిద్ధి హరిహర అయ్యప్ప గుట్టపై నిర్మించిన ఆలయంలో శనివారం 8వ వార్షికోత్సవ పూజలను ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి మూల విరాట్‌తో పాటు గణపతి, కుమార, శిరిడిసాయి విగ్రహాలకు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. అయ్యప్ప స్వామి మాలధారులు నైవేద్యం సమర్పించారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

రహదారులపై నూర్పిళ్లు

అమరచింత: వరికోతలు ఊపందుకున్న వేళ అమరచింత పట్టణంతో పాటు నాగల్‌కడ్మూర్ గ్రామాల్లో రైతులు వరిధాన్యాన్ని ప్రధాన రహదారులపై ఆరబెడుతుండటంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రభుత్వం పంట నూర్పిళ్ల కోసం సబ్సిడీలతో కల్లాలను నిర్మించి ఇస్తున్నామని చెబుతున్నా రైతులు మాత్రం పంటపొలాల్లో కల్లాల ఏర్పాటుకు సముఖత చూపడం లేదు. అమరచింత నుంచి మద్దూరు, అమరచింత నుంచి అల్లీపురం, అమరచింత నుంచి నాగల్‌కడ్మూర్ గ్రామాల మీదుగా వెళ్తున్న ప్రయాణికులు రహదారి మలుపుల్లో రాత్రి వేళ ధాన్యం కుప్పల వద్ద రాళ్లను పేర్చి ఉంచడంతో వాహన చోదకులు వాటిని గమనించక అదుపు తప్పి వాహనాలను కింద పడేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాహదారులపై పంట నూర్పిళ్లు జరుగకుండా రైతులకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు.



అమరచింత నుంచి మద్దూరు రహదారిపై ఆరబోసిన వరిధాన్యం

పంట రక్షణకు చీర కంచె

పెద్దకొత్తపల్లి: రైతులు యాసంగిలో సాగు చేసిన వేరుశనగ, మినుము తదితర పంటలపై అడవి పందులు దాడులు చేయకుండా రైతులు చీరలను కంచెగా ఏర్పాటు చేసుకుని పంటలను కాపాడుకుంటున్నారు. మండలంలో యాసంగి పంటలను 10,236 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశారు. 6,336 ఎకరాల్లో మినుము పంటను సాగు చేశారు. ఈ పంటలను కాపాడుకునేందుకు రైతులు చీర కంచెతో పాటు చుట్టూ వైర్లు చుట్టీ పంటలను కాపాడుకుంటున్నారు. వేరుశనగ పంటలపై ఎక్కువగా అడవి పందులు దాడి చేసి, వాటిని ధ్వంసం చేస్తున్నాయి. దీంతో రైతులు చీర కంచెలతో పాటు మైకులు ఏర్పాటు చేసుకుని శబ్దాలు చేస్తూ.. అడవి పందులు దాడి చేయకుండా పంటలను కాపాడుకుంటున్నారు. అటవీ ప్రాంతాలైన బాచారం, మారెడుదిన్నె, యాపట్ల, చిన్నకొత్తపల్లి తదితర గ్రామాల్లో రైతులు పంటలను కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



యాపట్లలో పంటకు చీర కంచె ఏర్పాటు చేస్తున్న రైతు